క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ మధు

పెద్దపల్లిరూరల్: రోడ్డుపై వాహనం నడిపేటప్పుడు పాటించాల్సిన ట్రాఫిక్ నిబంధనలపై ఆటోడ్రైవర్లు, యజమానులు కనీస అవగాహన కలిగి ఉండాలని ఏఎంవీఐ మధు అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆటో యూనియన్ సభ్యులకు అవగాహన కల్పించారు. ప్రయాణికులతో ఆటో నడిపే సమయంలో రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కావొద్దని హితవు పలికారు. ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నియమావళిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

ఉద్యోగ విరమణ సన్మానం



సన్మానిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం సంస్థలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందనున్న హనుమంతును తోటి కార్మికులు ఘనంగా సన్మానించారు. ఆదివారం జరిగిన సన్మాన కార్యక్రమంలో సంస్థలోని యూనిట్–7 యాష్ హ్యాండ్లింగ్ మెయింటినెన్స్‌లో 30ఏళ్లుగా విధులు నిర్వహించిన హనుమంతును ఐఎన్టీయూసీ అనుబంధ రామగుండం రీజియన్ కాంట్రాక్టు వర్కర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి భూమల్ల చందర్ సన్మానించారు. కార్మికులు, సూపర్‌వైజర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ



గోదావరిఖనిటౌన్: రామగుండం నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో పేద విశ్వబ్రాహ్మణ మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు నాగుల మల్యాల రాజమౌళి చార్యులు, పానుగంటి స్వామి, మారుతి, ఆలయ కమిటీ చైర్మన్ భాస్కర్, ప్రభాకరచారి, ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, రమణబాబు, వీరాచారి, రామయ్య పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



హోమంలో పాల్గొన్న స్థానికులు

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండా గ్రామ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని మూలవిరాట్‌తో పాటు శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బదావత్ రాజునాయక్, సారయ్య, ఇస్లావత్ షకలాల్, రాజు, మూడ్ రమేశ్, భూక్య రాజేశ్, గట్టయ్య, తిరుపతి, స్థానికులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ఓదెల: రౌడీషీటర్స్ క్రమశిక్షణతో కలిగి ఉండాలని, ఎవరికీ ఇబ్బంది కలిగించొద్దని పొత్కపల్లి ఎస్సై రమేశ్ సూచించారు. మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ గతంలో నేరచరిత్ర కలిగిన వారి కుటుంబ జీవన స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతలకు, ప్రజల స్వేచ్ఛకు, జీవన విధానాలకు భంగం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. బైండోవర్ కాలంలో నేరాలకు పాల్పడితే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని పేర్కొన్నారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

జూలపల్లి: గ్రామీణ ప్రాంత యువకులు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుడూరి శ్రీనివాస్ ఆకాంక్షించారు. మండలంలోని పెద్దాపూర్‌లో యూత్ సభ్యులకు, విద్యార్థులకు ఆదివారం వాలీబాల్ కిట్లు అందజేశారు. కల్లెపెల్లి ఉమేందర్, కిషన్, రాజు, నరేశ్, స్వామి, లచ్చయ్య, రాయమల్లు ఉన్నారు.

తీరనున్న భూమాత కష్టాలు

- అదనపు కలెక్టర్, ఆర్డీవోలకు అధికారాల బదలాయింపు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వేణు (ఫైల్)

సుల్తానాబాద్: ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ సులభతరం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భూమికి సంబంధించిన పనులన్నీ కలెక్టర్‌తో ముడిపెట్టడంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులు, మంత్రులు దృష్టిసారించారు. దీంతో అధికార కేంద్రీకృతమైన సమస్యలను విడదీసి ఆర్డీవో, జేసీలకు అప్పగిస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. దీంతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

అసెంబ్లీ ఎన్నికలకు ముందు హామీ

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ధరణి రద్దు చేసి భూమాతను ఏర్పాటు చేస్తామని, రైతులకు ఇబ్బందులు కలగకుండా సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. ఏడాదిలోగా ఇచ్చిన హామీ అమలుకు శ్రీకారం చుట్టింది. అసెంబ్లీ సమావేశాల్లో భూమాత తీర్మానానికి ఆమోదం తెలిపారు. కొత్త పోర్టల్ అమల్లోకి రానుంది.

అదనపు కలెక్టర్లు..

అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) కొత్తగా ధరణి సాఫ్ట్‌వేర్‌లోని 4 మాడ్యూల్స్‌కు అధికారం పొందారు. మ్యూటేషన్ దరఖాస్తులు, పీపీబీ, కోర్టు కేసు, టీఎం24, ఇళ్లు, ఇంటి స్థలంగా పేరు ఉన్న సందర్భంలో నాలా కన్వర్షన్ జారీ, పాస్‌బుక్‌లో పేరు మార్పుల దరఖాస్తులకు పరిష్కారం దొరకనుంది.

సమస్యలు పరిష్కరిస్తున్నాం



అధికారాల బదలాయింపుతో భూ సమస్యలు త్వరగా తీర్చే అవకాశం వచ్చింది. ఎక్కువ మంది రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు డివిజన్, అదనపు కలెక్టర్ స్థాయిలోనే పరిష్కరించేలా అధికారాలు ఇచ్చారు. బదలాయించిన అధికారులను వినియోగించుకొని సమస్యలు పరిష్కరిస్తున్నాం. – గంగయ్య, ఆర్డీవో, పెద్దపల్లి



సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లోని మినీ కలెక్టరేట్లో ఉన్న మరుగుదొడ్లను తెరిపించాలని కార్యాలయాలకు వచ్చే ప్రజలు కోరుతున్నారు. కార్యాలయంలో తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, ఎస్టీవో, వ్యవసాయ కార్యాలయం, ఎక్సైజ్ కార్యాలయాలు ఉన్నాయి. కాగా పక్కనే ఎంపీడీవో, సివిల్ ఆస్పత్రి, కోర్టు, ప్రాంగణాలకు పక్కన ఉండడంతో మరుగుదొడ్లు అందుబాటులో ఉండాలని ఉద్దేశంతో అప్పటి ప్రజాప్రతినిధులు నిర్మించారు. మహిళలకు తీవ్ర అసౌకర్యంగా ఉందని, వెంటనే మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకువచ్చి ఇబ్బందులను తొలగించాలని అధికారులను కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

యువత సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి



విజేతకు బహుమతి అందిస్తున్న ప్రభుత్వ విప్

ధర్మారం: యువత సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, క్రీడలపై దృష్టిసారించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ సూచించారు. ధర్మారం మండలం కమ్మరిఖాన్‌పేటలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ టోర్నీలో 43 టీమ్‌లు పాల్గొనగా మానకొండూర్ మండలంలోని అన్నారం జట్టు విజేతగా నిలిచింది. కమ్మరిఖాన్‌పేట జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేత జట్టుకు షీల్డుతో పాటు రూ.30వేల నగదును ప్రభుత్వ విప్ అందించారు. రన్నర్ జట్టుకు రూ.15వేలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, టోర్నీ నిర్వాహకులు నాయకులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలి



మాట్లాడుతున్న ముత్యంరావు

పెద్దపల్లిరూరల్: పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులపై పనిభారం మోపేలా అమలు చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనాఆ కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరారు. వేతనాలు పెంచి జీవో నంబర్ 51ను సవరించాలని, వేతనాలు చెల్లించాలన్నారు. సమస్యలు సత్వరమే పరిష్కరించాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు రవీందర్, ఖాజా, అశోక్, లచ్చయ్య, రాజయ్య, నాగయ్య, రామచంద్రం, ముస్తఫా, నాగేశ్వర్, రవికుమార్, మల్లయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

నానేస్తం చారిటబుల్ ట్రస్టు నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

ఎలిగేడు: మండల కేంద్రంలోని నానేస్తం చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో 11వ వార్షికోత్సవం నిర్వహించారు. అనంతరం నానేస్తం చారిటబుల్ ట్రస్టు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కట్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా వీరగోని లక్ష్మీనారాయణ, మహిళా అధ్యక్షురాలిగా పానగంటి సుమతి, మహిళా కార్యదర్శిగా వాల నీరజ, కోశాధికారిగా ఆసంపల్లి శంకర్, నిర్వాహక కార్యదర్శిగా భూసారపు శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా రంగు రాములుగౌడ్, ఉపాధ్యక్షులుగా తానిపర్తి సుధాకర్‌రావు, వాల నీరజ, వెంగళదాసు అశోక్, వంగ సత్యనారాయణ, కొత్తిరెడ్డి మల్లారెడ్డి, బైరెడ్డి రాజిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా వంగ శ్రీశైలం, నామని సువర్ణ, కట్ల సంపత్, పెగడ స్వర్ణలత, సమాచార కార్యదర్శులుగా బుర్ర ఆంజనేయులు, కుంట అనిల్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా అర్జనపల్లి లక్ష్మి, సింగిరెడ్డి విజయారెడ్డి, తీట్ల రమేశ్, కె.సత్యనారాయణ, పల్లె వీరస్వామి, ఎ.కనుకయ్య, బి.అశోక్ ఎన్నికయ్యారు. అనంతరం ట్రస్టు కార్యాలయంలో చెట్లు నాటారు.

అంబేడ్కర్ సంఘం పట్టణ అధ్యక్షుడిగా రాహుల్



సన్మానిస్తున్న సంఘం సభ్యులు

సుల్తానాబాద్: అంబేడ్కర్ సంఘం పట్టణ అధ్యక్షుడిగా ఆరెపల్లి రాహుల్‌ను ఎన్నుకున్నారు. పట్టణంలోని సుభాష్‌నగర్‌లో ఆదివారం సంఘం పెద్దలు, యువకులు సంఘం ఎన్నికలు నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా ఆరెపల్లి రాహుల్, ఉపాధ్యక్షుడిగా న్యాతరి కాళీచరణ్, కల్వల రాజు, ఆరెపల్లి రాకేశ్, ప్రధాన కార్యదర్శులుగా వెంకటేశ్, చిలుముల ప్రదీప్‌కుమార్, కల్వల సతీశ్, సంయుక్త కార్యదర్శులుగా తాండ్ర ప్రశాంత్, ఆరెపల్లి కిషోర్ (చంటి), మామిడిపల్లి తిరుపతి, కోశాధికారి న్యాతరి మోహన్, చిలుముల ప్రణయ్, ప్రచార కార్యదర్శులు న్యాతరి ఉదయ్, ఆరెపల్లి ప్రశాంత్, కార్యవర్గ సభ్యులుగా సలిగంటి శివకుమార్, చీటికల పరమేశ్, కాంపల్లి శ్రీనివాస్, కొండ్ర వినయ్, మచ్చ దిలీప్‌ను ఎన్నుకున్నారు. అనంతరం వారిని సన్మానించారు.

నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఏఎస్సై మునీరోద్దీన్

పాలకుర్తి: మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం బసంత్‌నగర్ ఏఎస్సై మునీరోద్దీన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ పాలకుర్తి మండల అధ్యక్షుడు వైద్య నరేశ్, ప్రధాన కార్యదర్శి మాదాసు భూమయ్య, సంగెం ప్రకాశ్, రామ్‌కుమార్, తిరుపతి, మధు, సాగర్ పాల్గొన్నారు.

ఆకెనపల్లిలో పోలీసుల పల్లెనిద్ర



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రామగుండం: పల్లెనిద్రతోనే పోలీసులు ప్రజలతో మమేకమయ్యే అవకాశం ఉంటుందని అంతర్గాం ఎస్సై బోయ వెంకటస్వామి అన్నారు. ఈ మేరకు శనివారం రాత్రి అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లిలో తన సిబ్బందితో కలిసి పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పల్లెనిద్రతో శాంతిభద్రతలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, షీ టీం విధులు, బాధ్యతలు తదితర అంశాలను ప్రజలకు వివరించే అవకాశం కలిగిందన్నారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అందుకు గ్రామస్తులందరూ ఏకతాటిపైకి వచ్చి నిర్ణయం తీసుకోవాలని కోరారు. గాదె సుధాకర్, గంగాధరి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు ఆదర్శం భారత రాజ్యాంగం



నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: ప్రపంచ దేశాలకు భారత రాజ్యాంగమే ఆదర్శమని బీఎంఎస్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం, ఆలయ ఫౌండేషన్, తెలంగాణ అంబేడ్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం పూలే, అంబేడ్కర్ జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు పట్టణంలోని మహాత్మా జ్యోతీరావు పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొంకూరి మధు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ సీఈవో తీట్ల రమేశ్‌బాబు, నాయకులు కాంపెల్లి సతీశ్, మంతెన లింగయ్య, శనిగరపు రామస్వామి, దుబాసి బొందయ్య, ఆకునూరి బాల అంకూస్, శశిభూషణ్, రాజమౌళి, బూడిద మహేందర్ పాల్గొన్నారు.

అక్షర లఘు చిత్రానికి మొదటి బహుమతి

గోదావరిఖనిటౌన్: తెలుగు భాష సాంస్కృతిక శాఖ, షార్ట్ ఫిలిం ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కరీంగనర్ ఫిలింభవన్‌లో రాష్ట్ర స్థాయి మానేటి లఘు చిత్రం పోటీలు నిర్వహించారు. పోటీల్లో గోదావరిఖనికి చెందిన దర్శకులు నగునూరి విజయ్ దర్శకత్వం వహించిన అక్షర లఘు చిత్రం మొదటి బహుమతి, రూ.20వేల నగదు గెలుచుకుంది. అలాగే గోదావరిఖనికి చెందిన అమేజింగ్ స్టార్ వేముల అశోక్ కరోనా బ్యానర్‌పై మడుపు శ్రీనివాస్ దర్శకత్వం వహించి నిర్మించిన శ్రీకృష్ణసత్య లఘు చిత్రానికి స్పెషల్ కన్సోలేషన్ బహుమతి లభించింది.

సంక్షిప్త వార్తలు

• దుర్గాభవానీ సేవాసమితి కార్యవర్గం ఏకగ్రీవం

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీదుర్గాభవానీ మాత కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక హనుమాన్ ఆలయంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా కనపర్తి భానుచందర్, ఉపాధ్యక్షుడిగా నగునూరి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పాలగాని సతీశ్, కోశాధికారిగా కనపర్తి రాజేశ్‌ను ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా తాటికొండ వేణు, కోడూరి రాజేశ్వర్, కోడూరి మహేశ్, దేవసాని ఆంజనేయులు, మడ్లపెల్లి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

జూలపల్లి: మండల కేంద్రంలోని నిరుపేద మృతుడి కుటుంబాన్ని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు గుజ్జుల రామకృష్ణారెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాహ కొంపల రాజన్న సోదరుడు లచ్చయ్య ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. కాగా మాజీ ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్, నాయకులు అమరగాని ప్రదీప్‌కుమార్, మెండె రాజయ్య, కొమ్ము ఐలయ్య, కల్లెం దామోదర్‌రెడ్డి, మేరుగు కనుకయ్య, బుసారపు రవీందర్, ఆవుల రాజు, కంచి శ్రీను, గడ్డం మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

ఓదెలలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న నల్ల మనోహర్‌రెడ్డి

ఓదెల: గ్రామీణ క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి అన్నారు. ఓదెల గ్రామంలో ఓదెల యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల స్థాయి క్రికెట్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆటల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ జట్లకు టీషర్టులతో పాటు క్రికెట్ కిట్లు పింపిణీ చేశారు. క్రీడాకారులు ఆయనను సన్మానించారు. మాజీ సర్పంచులు వస్తంనాయక్, జీడుల సారయ్య, మాజీ ఎంపీటీసీ ఐరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు డాక్టర్ సతీశ్ పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

ఉపాధ్యాయులు మార్గదర్శకులు



మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

కోల్‌సిటీ: ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులని సింగరేణి సంస్థ ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. గోదావరిఖనిలోని ఇల్లందు క్లబ్‌లో ఆదివారం ×ఓరియంటేషన్ ప్రోగ్రాం ఫర్ ఆల్ స్కూల్స్¥ అనే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జీఎం మాట్లాడారు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞాన దీపాన్ని వెలిగించేది విద్య అయితే, దీపానికి నిప్పు రాజేసేది ఉపాధ్యాయులేనని అన్నారు. పాఠశాలల్లో, తరగతి గదుల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పలువురు ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ డి.కిరణ్ బాబుతోపాటు సెక్టార్–2, సెక్టార్–3, సీసీసీ, మందమర్రి, గోలేటి, భూపాలపల్లి, సింగరేణి పాఠశాలల నుంచి 200మంది ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, సింగరేణి అధికారులు గోపాల్‌సింగ్, చిలుక శ్రీనివాస్, శ్రీసింగ్ రాజు, డాక్టర్ లక్ష్మీవాణి, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పతంగుల షాపుల్లో పోలీసుల ఆకస్మిక తనిఖీ



తనిఖీ చేస్తున్న పోలీసులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలో నిషేధిత చైనా మాంజాను అరికట్టడంపై పోలీసులు ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం పోలీసులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్థానిక లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్, మార్కండేయకాలనీ తదితర ప్రాంతాల్లో ముందస్తు తనిఖీలు చేపట్టారు. నిషేధిత మాంజాను అమ్మినా, చైనా మాంజాతో గాలిపటాలు ఎగరేసినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. వ్యాపారస్తులు, ఔత్సాహికులు చైనా మాంజా విక్రయాలు, వినియోగం జరగకుండా చూడాలని, సమాచారం తెలిస్తే పోలీసులకు అందించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పెద్దపల్లిరూరల్: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు



జ్యోతినగర్: పూర్వ విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలో ఆదివారం 1998–99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పట్టణంలోని సిద్దార్థ సెకండరీ పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను వారు గుర్తు చేసుకున్నారు. పాఠాలు చెప్పిన అప్పటి గురువులు రమేశ్, కొండయ్య, వెంకటస్వామి, శ్రీనివాస్, సుప్రసన్న, రమేశ్, అహ్మదిబేగంను సన్మానించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు చేసిన నృత్యం ఆకట్టుకుంది.

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని శ్రీమయిగ్రాండ్ హాలులో ఆదివారం రామగుండం జెడ్పీహెచ్ఎస్ స్కూల్ 1999–2000లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పూర్వ విద్యార్థులు రామగుండం కార్పొరేషన్ ఒకటో డివిజన్ కార్పొరేటర్ ముదాం శ్రీనివాస్, రాళ్లబండి విజయ్, ముక్కెర జ్ఞానశేఖర్, జమీల్, అజీం, వేణు, రమేశ్, రాజేశ్, మధులత, జ్యోతి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాంబాబు

సుల్తానాబాద్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని జిల్లా నెహ్రూ యువకేంద్రం వలంటీర్ రాంబాబు అన్నారు. సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నెహ్రూ యువ కేంద్రం, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్ ఆధ్వర్యంలో ఆదివారం బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన 150 మంది క్రీడాకారులను పరిచయం చేసుకొని వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్, షటిల్ పోటీలను ఆయన ప్రారంభించారు. వాలీబాల్ విజేతగా సుల్తానాబాద్ జట్టు, ద్వితీయ బహుమతిగా సుల్తాన్‌పూర్ జట్టు గెలుపొందారు. కబడ్డీ పోటీల్లో పొత్కపల్లి జట్టు ప్రథమ బహుమతి గెలుచుకోగా, సుల్తానాబాద్ జట్టు ద్వితీయ బహుమతి గెలుచుకుంది. బ్యాడ్మింటన్, రన్నింగ్, షాట్‌పుట్ విజేతగా నిలిచిన జట్లకు రూ.4వేల విలువగల స్పోర్ట్స్ కిట్‌తో పాటు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఏజీపీ డి.ఆంజనేయులు, స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి తిరుపతి, సీనియర్ క్రీడాకారుడు సత్యం, సతీశ్, నెహ్రూ యువ కేంద్రం సభ్యులు మహేశ్ పాల్గొన్నారు.